


**నీళ్ళ తొట్టిలో ఈదే చేపల్ని చూస్తూ కాలం గడపడం నాకు ఇష్టం. దానికి కారణం సోమరితనం అనో, సౌందర్యారాధన అనో, తాత్వికచింతన అనో, ఎవరు ఎలా అనుకున్నా నాకు అభ్యంతరం లేదు.**

ఈ మధ్యే ఓ గోల్డ్ ఫిష్ కొని తెచ్చి ఎక్వేరియంలో వేసేను. దాని వ్యవహారం చిత్రంగా వుంటుంది. మిగతా చేపలతో కలవదు. అసలు తొట్టిలో తను కాక మరి కొన్ని చేపలు కూడా వున్నాయన్న ధ్యాసే వున్నట్లు లేదు దానికి. విలాసంగా రెక్కలాడిస్తూ, తోక ఊపుకుంటూ, మొప్పలతో శ్వాసిస్తూ, తన వలయాల్ని తను సృష్టించుకుంటూ వుంటుంది. మిగిలిన చేపలన్నీ దానికి తోవ ఇచ్చి, తాము ఒక మూలకి సర్దుకుపోతూ వుంటాయి. దాని మేని చాయ చూసి దానికా ప్రత్యేక ప్రతిపత్తి ఇచ్చాయేమో! తన ప్రత్యేకతకి బంగారు చేప గర్వపడుతూందేమో నాకు తెలియదు.

గోల్డ్ ఫిష్‌నే తదేకంగా చూస్తూ పరిసరాల్ని మరచిపోయిన నేను, మామయ్య పలకరింపుతో ఈ లోకంలో కొచ్చి పడ్డాను. "ఏంరా, ఏ లోకంలో వున్నావ్? దయ చెయ్యమంటావా?" అని అడుగుతూనే లోపలికొచ్చాడు.

"ఫిష్ టేంక్‌లో వున్నాను. దయచెయ్యి" అని నేను మామయ్య రెండు ప్రశ్నలకీ సరియైన సమాధానాలిచ్చాను.

మామయ్య వచ్చి కుర్చీలో కూర్చున్నాడు. ఈ మధ్యే తనకి షష్ఠిపూర్తి అయింది. నేను వెళ్ళలేకపోయాను. షష్ఠిపూర్తితో హఠాత్తుగా మరో దశాబ్దం పెరిగినట్టున్నాడు మామయ్య.

"ఏం మామయ్యా, తిరుగు ప్రయాణం ఎప్పుడు?" అడిగాను నేను.

"సరిరా! ఇంటికొచ్చిన చుట్టానికి అదన్నమాట మర్యాద!" అన్నాడు మామయ్య.

ఆ సమయంలో కొత్త వాళ్ళెవరైనా అక్కడ వుంటే నాకు మేనర్స్ లేవనో, మా ఇద్దరికీ ఏదో శత్రుత్వం వుందనో అనుకుంటారు. కాని రెండూ కాదు. మామయ్య మాట తీరే అంత. నేనూ ఆ పద్ధతిలోనే మాట్లాడితే తన కిష్టం. అంచేత మా మధ్య సంభాషణ ఎప్పుడూ అలాగే వుంటుంది.

"మరేంలేదు మామయ్యా, ఇన్నాళ్ళూ టైర్ అయి ఇప్పుడే రిటైర్ అయ్యావు కదా, ఇప్పుడైనా వచ్చిన వాడివి నాలుగు రోజులు వుంటావా, చెప్పుల్లో కాళ్ళు పెట్టుకునే వచ్చావా?" అన్నాను నేను.

"చెప్పుల్లో కాళ్ళు కాకపోతే చేతులు పెట్టుకుంటారుట్రా? అయినా రిటైర్ అయ్యానంటే, గవర్నమెంటు సర్వీసు నుంచి రిటైరయ్యాను గాని, ఈ లోకంనుంచి రిటైర్ అవలేదు కదా! అంతవరకు ఈ ప్రాణికి విశ్రాంతి లేదు!" అన్నాడు మామయ్య నాటకీయంగా నిట్టూరుస్తూ.

"అదెప్పటి మాటలే! మరో పలభై ఏళ్ళ తరవాత కదా! ఈ లోగా ఏమిటి నీ ప్రోగ్రాం? ఉద్యోగం విరమించావు సరే, ఇక సద్యోగం ఏమిటి?"

"దేశ సేవ" అన్నాడు మామయ్య గంభీరంగా.

నాకు పకాలున నవ్వొచ్చింది. ఆపుకోలేకపోయాను.

"ఎందుకురా ఆ నవ్వు?" అన్నాడు మామయ్య అఫెండ్ అయినట్టు పైకి కనిపించకుండా.

"ఏం లేదు మామయ్యా, ఏదో గుర్తొచ్చి......" తప్పించుకోబోయాను.

మామయ్య వదలలేదు. ఏం గుర్తొచ్చిందో చెప్పమన్నాడు.

"మా ఫ్రెండ్ ఒకడున్నాడులే. వర్ధమాన రచయిత. ఈ మధ్య ఓ పట్టిక తయారుచేశాడు — 'ఈ దేశంలో సగటు మనిషి జీవిత చరిత్ర — వివిధ దశలు' అని."

"అయితే?"

"తెస్తానుండు" అని లోపలికి వెళ్ళి ఆ కాగితం తెచ్చి చూపించాను. అందులో ఇలా వుంది:

| వయసు | ధోరణి |
|---|---|
| 0-10 సం. | ఆటలు, అమాయకత్వం |
| 10-20 సం. | ఆశలు, ఆశయాలు |
| 20-30 సం. | ఉద్యోగం, ప్రేమ/పెళ్ళి |
| 30-40 సం. | పిల్లలు,ఆపరేషను, ప్రమోషను, స్కూటరు, ఇంటిస్థలం |
| 40-50 సం. | చత్వారం, చాదస్తం, దైవభక్తి |
| 50-60 సం. | పిల్లల పెళ్ళిళ్ళు, ఉద్యోగాలు, స్వంతఇల్లు, తాపత్రయం, లౌక్యం, సలహాలు |
| 60-70 సం. | సంఘసేవ, దేశభక్తి, మతం, ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలు |
| 70 సం. తర్వాత | మౌనం, నిర్వేదం, సుందరకాండ పారాయణ, భజగోవిందం |

వే నన్నాను–"సరిగ్గా మా వాడన్నట్టే నీకు 60 దాటగానే దేశసేవవైపు గాలి మళ్ళిందని నాకు నవ్వొచ్చింది."

"ఏడిశారు! ఎవడా ఫ్రెండు? వాడికి లేకపోతే నీకైనా వుండొద్దు బుద్ధి?" అన్నాడు మామయ్య కోపం దాచుకోకుండా.

"అలా అంటావేం మామయ్యా? మావాడి జోస్యం నిజమైందిగా!" అన్నాను నేను. మధ్య తరగతి మనుషులకి వాళ్ళ బలహీనతల్ని ఎత్తి చూపిస్తే భరించలేరని నాకు తెలుసు. కాని ఇన్ని జోకులు వేస్తూ చతురతతో మాట్లాడే మామయ్యకూడా మామూలు మధ్య తరగతి మనిషే అంటే నాకు నమ్మబుద్ధి కావడం లేదు. కాని ముంజేతి కంకణానికి అద్దం ఎందుకూ?

మామయ్య నాకేసి నిశితంగా చూస్తూ, "నీ కెన్నేళ్ళురా ఇప్పుడు?" అనడిగేడు.

"ముప్పయి ఒకటి" అన్నాను హఠాత్తుగా ఎందుకు మాట మార్చాడో వెంటనే స్ఫురించక.

"మరి నీ వాడి థీరీ ప్రకారం నువ్విప్పుడు ఏం చేస్తూ వుండాలి? సంసార జంజాటంలో వుండాలి! వున్నావా? సన్నాసిగాడిలా వున్నావు ఇంకా పెళ్ళీ పెటాకులూ లేకుండా. మరి నీవాడి థీరీ తప్పని తేలిపోలేదూ?" అన్నాడు మామయ్య, తన మధ్య తరగతి తర్కం ఉపయోగిస్తూ.

నేను దానికి జవాబు చెప్పలేదు. జవాబు చెప్పలేనని నాకు తెలుసు. నీళ్ళ తొట్టిలోని నా బంగారు చేప కేసి చూస్తూ మౌనంగా వుండిపోయాను. దానిలాంటి బంగారు తొడుగు ఏదీ నాకు లేదు మరి!

మామయ్య తనే గెలిచాడనుకుని విజయగర్వంతో మందహాసం చేశాడు. మా బంధువులు నాతో వాదించినప్పుడల్లా వాళ్ళే గెలుస్తుంటారు.

●

*ఈ బహుమతి పొందిన రచనలలో మీకు నచ్చిన మినీ కథ వివరాలు దిగువ ఇచ్చిన కూపన్‌లో నింపి, పోస్ట్ కార్డుపై అంటించి మా కార్యాలయానికి పంపండి.*

— ఎడిటర్

నాకు నచ్చిన కథ: ------------------------------

రచయిత/ రచయిత్రి: ------------------------------

పేజీ నంబరు: ------------------------------